సాక్షి
రంగారెడ్డి
బుధవారం, 8, అక్టోబర్, 2025



దసారా

కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. నాటు సారా తండాల్లో విచ్చలవిడిగా తయారవుతోంది. 8లో ▸



భూములు కాపాడండి

ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం డిమాండ్ చేశారు. 8లో ▸



బైండోవర్

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ నేరాల్లో పాలుపంచుకున్న వ్యక్తులను బైండోవర్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

10న డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక

మొయినాబాద్: 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా డివిజనల్ స్థాయి పోటీలకు ఈ నెల 10న క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అండర్-14 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2012 జనవరి 1 లోపు, అండర్-17 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 1 లోపు జన్మించి ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్ తీసుకుని 10వ తేదీ ఉదయం 9 గంటల వరకు అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 80744 82273, 92462 12488 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వడ్డెరులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేష్ డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడలోని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ.. వడ్డెర వృత్తిదారులకు లోన్లు, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. రూ.5 కోట్ల వరకు ఎలాంటి ఈఎండీ లేకుండా కాంట్రాక్టు పనుల్లో 30 శాతం పనులు ఇవ్వాలని, క్వారీలు, గుట్టలపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కుంచం వెంకటకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ డేరంగుల రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇరుగదిండ్ల కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి జోనల్ లెవల్ కబడ్డీ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 9 నుంచి జరిగే 69వ హయత్‌నగర్ జోనల్ లెవల్ కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జోనల్ పరిధిలోని పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు జోనల్ నుంచి బలమైన, నైపుణ్యం గల క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ హాజరు కానున్నట్లు చెప్పారు. అండర్-14 బాలురు, బాలికలు, అండర్ -17 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

బిల్లులు విధిగా ఇవ్వాలి

జిల్లా వ్యవసాయాధికారి ఉష



ఆమనగల్లులోని ఓ ఫర్టిలైజర్ షాపులో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఉష

ఆమనగల్లు: ఫర్టిలైజర్ షాపుల్లో విక్రయించే విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన బిల్లులను రైతులకు విధిగా ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష ఆదేశించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు షాపు ముందు ప్రదర్శించాలని అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయించాలని తెలిపారు. ప్రతిషాపులో విధిగా స్టాకు రిజిస్టర్ మెయింటెన్ చేయాలని, ఎప్పటికప్పుడు వివరాలు పొందుపర్చాలని చెప్పారు. మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు నిర్మాణాలు!

మున్సిపాలిటీల్లో ఇష్టారాజ్యం

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పార్కుస్థలాలు, రోడ్లు యథేచ్ఛగా కబ్జా
- పట్టించుకోని అధికారులు
- కోర్టులను ఆశ్రయిస్తున్న బాధితులు



బండగ్‌పేట్‌లోని ఓ నిర్మాణం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పట్టణ ప్రణాళికా విభాగం దారి తప్పుతోంది. కళ్లముందే భారీగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా, అనధికారిక సెల్లార్లు తవ్వుతున్నా.. కళ్లప్పగించి చూస్తుందే కానీ అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. సరికదా పరోక్షంగా అయా అక్రమార్కులకు కొమ్ముకాస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. శివారు మున్సిపాలిటీల్లో అనుమతి లేని నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మణికొండ, నార్సింగి, బండ్లగూడజాగీర్, శంషాబాద్, బడంగ్‌పేట్, తుర్కయంజాల్, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో అడ్డగోలు నిర్మాణాలు వెలుస్తున్నాయి. కనీస అనుమతులు లేకపోవడంతో పాటు 60 గజాల స్థలంలో ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. కనీసం గాలి, వెలుతురు కూడా లేకుండా చేస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేస్తున్నారే కానీ.. తర్వాత వాటిని పట్టించుకోవడం లేదు. బేస్మెంట్ దశలోనే అడ్డుకోవాల్సింది పోయి.. తీరా స్లాబులు వేసి, గోడలు నిర్మించిన తర్వాత తనిఖీల పేరుతో టీపీఓ, అసిస్టెంట్ టీపీఓ, చైన్‌మెన్‌లు వచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇచ్చేందుకు నిరాకరిస్తే నిర్మాణాలను మధ్యలోనే కూల్చే ప్రమాదం ఉండటంతో భవన యజమానులు కూడా వారు అడిగినంత ఇచ్చి పంపుతున్నారు. ముఖ్యంగా 111 జీఓ పరిధిలోని శంషాబాద్ మున్సిపాలిటీలో భారీ సెల్లార్లు, భవంతులు వెలుస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, విద్యుత్ అధికారులు సైతం సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. పాత వెంచర్లలో రోడ్లు, పార్కులు, విద్యా సంస్థలు, దేవాలయాల కోసం వదిలిన ఖాళీ స్థలాలను కబ్జా చేసి, గుట్టుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అంశంపై స్థానికులు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

ఆ ఫిర్యాదుపై చర్యలు తీసుకోండి..

బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ఆక్రమణకు సంబంధించి అమెరికన్ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. అనధికారిక ప్రతివాదులైన షేక్ సైఫుద్దీన్, ఫ్రైడ్ ఇండియా మాన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పోలీసుల సాయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది. బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని రేణుకాపూర్ విలేజ్ సర్వే నంబర్ 354/4లోని అమెరికన్ టౌన్‌షిప్ లే అవుట్ ప్రకారం 40 ఫీట్ల రోడ్డు ఉండగా, మహ్మద్ సైఫుద్దీన్ రహదారిని కబ్జా చేశారని, చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అమెరికన్ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడితో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మున్సిపాలిటీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల ఫిర్యాదు మేరకు చర్య తీసుకున్నామని చెప్పారు. అనధికారిక ప్రతివాదుల నిర్మాణాలు కూల్చివేశామన్నారు. వారు మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదు అందిందని, అవసరమైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి సాయం పొందాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేశారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

క్రీడాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జోనల్ స్థాయి టోర్నమెంట్‌ను మంగళవారం పట్టణ సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో క్రీడలకు ప్రోత్సాహం కరువైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల కోసం స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. అవసరమైతే సొంత డబ్బులు వెచ్చించి క్రీడకారులకు సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, ఎస్‌జీటీ జోనల్ సెక్రటరీ సుశీల, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, నీళ్ల భాను, ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వర్లు, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం అమానుషం



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం: దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ, జిల్లా సభ్యుడు సామేల్ మాట్లాడుతూ.. మతోన్మాదంతో న్యాయవాది రాకేశ్ కిషోర్ తన బూట్‌ను న్యాయమూర్తి గవాయ్‌పై విసిరిన ఘటనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. న్యాయవాది రాకేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని.. ఈ దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈ.నర్సింహ, జి.నర్సింహ, ప్రకాశ్‌కారత్, బుగ్గరాములు, ఎల్లేష్, యాదగిరి, యాదయ్య, సుధాకర్, వీరేశం, వంశీ, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మంగళవారం విరామం లేకుండా సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5.30 నుంచి 7. 30 గంటల వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నంలో 39 మి.మీ, ఎలిమినేడులో 27.3, మంగల్‌పల్లిలో 22, కొంగరకలాన్‌లో 11.3, తుర్కయంజాల్‌లో 27, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 26 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

కడ్తాల్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్‌లు వాహ నా లు నడపొద్దని సూచించారు. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లైసెన్స్‌లేకుండా వాహనాలు నడపొద్దని, ద్విచక్రవాహనాలను హెల్మెట్ లేకుండా, కారును సీట్‌బెల్ట్ ధరించకుండా నడపరాదని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, ఎడమ చేతి వైపు నడవడం తదితర ట్రాఫిక్ నియమాలను వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రికార్డ్స్ దగ్ధం



రికార్డ్స్ దగ్ధమైన గదిని పరిశీలిస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలోని ఓ గదిలో భద్రపరిచిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన స్కాలర్‌షిప్ మాన్యువల్ ఆన్‌లైన్‌స్పైరల్ బాండింగ్ హార్డ్ కాపీస్ మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. 1982 నుంచి 2015 వరకు సంబంధించిన హార్డ్ కాపీస్, ఫైల్స్ మైసిగండి ఆశ్రమ పాఠశాలలోని ఓ గదిలో భద్ర పర్చారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గదిలో భద్ర పరిచిన రికార్డులు దగ్ధమయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గంగాధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వసతిగృహ సంక్షేమాధికారి బాలరాజు పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

రైతులు సంఘటితం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

- కాంగ్రెస్ భూములమ్ముకొని బతకాలని చూస్తోంది
- ముఖ్యమంత్రి సిగ్గుతో తలదించుకోవాలి
- ట్రిపుల్ ఆర్ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

నవాబుపేట: పిల్లలపై తల్లిదండ్రులకు ఎంత మమకారం ఉంటుందో.. రైతులకు భూమిపై అంతకన్నా ఎక్కువ ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టిన విషయం తెలిసిందే. వారిని మంగళవారం చిట్టిగిద్ద గ్రామంలో ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు భూమిని నమ్ముకొని బతుకుతుంటే కాంగ్రెస్ అన్నదాతల భూములను అమ్ముకొని ప్రభుత్వాన్ని నడపాలని చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతులకు మోసం జరుగుతుంటే స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో సీఎం తలదించుకోవాలన్నారు. అభివృద్ధిని తాము వ్యతిరేకించడం లేదని, రైతులకు సరైన మేలు చేయాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. ట్రిపుల్ ఆర్ బాధితులకు భూమికి బదులు భూమి.. లేదా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు తిరగబడితేనే వారికి సరైన న్యాయం జరిగిందని గుర్తు చేశారు. అదే తరహాలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పేదలను ముంచి.. పెద్దలకు లాభం చేకూర్చాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చిందని ఆరోపించారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, నాగేందర్‌గౌడ్, శుభప్రద పటేల్, ఆంజనేయులు, భరత్ రెడ్డి, దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, మాణిక్ రెడ్డి, కృష్ణారెడ్డి, శాంత కుమార్, నరేందర్ రెడ్డి, రాజు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ (డిగ్రీ) మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్‌సీలో అడ్మిషన్ పొందాలనేకునే విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీలో కనీసం 40శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. 38 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఎస్టీలకు 33, ఎస్సీలకు 1, ఓసీలకు 1, అనాథ (ఆర్ఫాన్)లకు 1, స్పోర్ట్స్ కోటా 1, వికలాంగుల కోటా కింద 1 సీటు ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు ఈనె 15 వరకు కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో లేదా 95730 21035, 77025 16674 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహా అడుగులు

హెచ్‌ఎండీఏ పునర్ వ్యవస్థీకరణకు రంగం సిద్ధం

- ట్రిపుల్ ఆర్ వరకు జోనల్ వ్యవస్థ
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కన్సల్టెన్సీ
- సాంకేతిక, ఆర్థిక బిడ్‌లపై దరఖాస్తులకు ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పునర్‌వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైంది. హెచ్‌ఎండీఏ పరిధి ట్రిపుల్ ఆర్ వరకు పెరిగిన దృష్ట్యా అందుకనుగుణంగా కార్యకలాపాల నిర్వహణ కోసం జోనల్ వ్యవస్థను విస్తరించనున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగర అవసరాలను దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎండీఏ సేవలను మరింత ఆధునికీకరించే లక్ష్యంతో సంస్థాగతమైన పునర్‌వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టారు. ఈమేరకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను అందజేసేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్‌లను ఆహ్వానించారు. హెచ్‌ఎండీఏ పరిధిని 7,257 చ.కి.మీ. నుంచి 10,526 చ.కి.మీ. వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 11 జిల్లాలు, 104 మండలాలు, 1,359 గ్రామాలు హెచ్‌ఎండీఏలో విలీనమయ్యాయి. ఈ మేరకు ప్రణాళికాబద్ధమైన మహానగరం నిర్మాణం, అభివృద్ధి దృష్ట్యా కార్యకలాపాలను వికేంద్రీకరించనున్నారు. ప్రస్తుతం ఘట్కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, మేడ్చల్-1, మేడ్చల్-2 జోన్‌ల పరిధిలో హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం సేవలు అందిస్తోంది. కొత్తగా పెరిగిన పరిధిని దృష్టిలో ఉంచుకొని మరో నాలుగు జోన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పరిధిలోకి వచ్చే ప్రాంతాలను కూడా పునర్‌వ్యవస్థీకరించనున్నారు. ఇందుకనుగుణంగా అధ్యయనం చేసి నివేదికను అందజేసేందుకు కన్సల్టెన్సీని ఎంపిక చేయనున్నారు.

మహానగర అభివృద్ధే ధ్యేయం

పునర్‌వ్యవస్థీకరణ, జోనల్ స్థాయిలో సేవల వికేంద్రీకరణ ద్వారా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించేందుకు అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, ప్రజారవాణా సదుపాయాల అభివృద్ధివంటి ప్రధానమైన కార్యకలాపాలపై కమిషనర్ దృష్టి కేంద్రీకరించనున్నారు. మరోవైపు సమర్థ ల్యాండ్‌పూలింగ్ పథకాన్ని అమలు చేయడంతో పాటు ఏకీకృత బిల్డింగ్, డెవలప్‌మెంట్ కోడ్‌ను రూపొందించడం, మాస్టర్‌ప్లాన్-2050 రూపకల్పన, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ వంటి లక్ష్యాల దిశగా కార్యాచరణ చేపట్టనున్నారు.

లక్ష్యాలు ఇలా..

- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హెచ్‌ఎండీఏను సంస్థాగతంగా పునర్‌వ్యవస్థీకరించనున్నారు.
- జోనల్ వ్యవస్థలను విస్తరించడంతో పాటు జోనల్‌స్థాయి కమిషనర్‌లను కూడా నియమించనున్నారు. తద్వారా అన్ని రకాల నిర్మాణరంగ అనుమతులు, లే అవుట్‌లు జోనల్ స్థాయిలోనే అందజేస్తారు. దీంతో మెట్రోపాలిటన్ కమిషనర్ వ్యూహాత్మక ప్రణాళిక, విధాన రూపకల్పనపై ప్రధానంగా దృష్టి సారించేందుకు అవకాశం లభిస్తుంది.
- హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన.

కన్సల్టెంట్‌ల ఎంపిక ఇలా..

టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్‌ల కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)ని ఆహ్వానించారు. కన్సల్టెంట్ ఎంపిక క్వాలిటీ అండ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో 80:20 నిష్పత్తిలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్‌ఎఫ్‌పీలో పేర్కొన్న అర్హత ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. అర్హత సాధించిన బిడ్డర్ల ఫైనాన్షియల్ బిడ్‌లను మాత్రమే తెరిచి తుది ఎంపిక చేపడతారు.

ప్రభుత్వ భూములు కాపాడండి


తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం

చేవెళ్ల: పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని న్యాలట గ్రామంలో ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. న్యాలట రెవెన్యూలోని సర్వే నెంబర్ 240లోని ప్రభుత్వ భూములను, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములను కొందరు కబ్జాదారులు, రాజకీయ నాయకులు కబ్జా చేసి విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి కబ్జాకు గురువుతున్న భూములను కాపాడాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు మక్బూల్, సుధాకర్‌గౌడ్, శివ, కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

మూసీకి పెరిగిన వరద


మంచిరేవుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

5 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మణికొండ: ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్ సాగర్ పరీవాహకంలో భారీ వర్షాలు కురవటంతో మరోమారు జంటజలాశయాల గేట్లను మరింత ఎత్తి ఎక్కువ మొత్తంలో వరదను మూసీ నదికి వదులుతున్నారు. సోమవారం సాయంత్రం, మంగళవారం ఉదయం వర్షం కురవటంతో గండిపేటలోకి పైనుంచి 1700 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దాంతో ఆరు గేట్లను మూడు అడుగులు, రెండు గేట్లను రెండు అడుగుల ఎత్తు ఎత్తి 2488 క్యూసెక్కుల నీటిని మూసీ నదికి మంగళవారం సాయంత్రం వదిలారు. హిమాయత్‌సాగర్‌కు పై నుంచి 2వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఆరు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 2500 క్యూసెక్కుల నీటిని మూసీకి వదులుతున్నారు. జంట జలాశయాల నుంచి 5వేల క్యూసెక్కుల నీరు మూసీకి వస్తుండటంతో అది ఉధృతంగా ప్రవహిస్తుంది. మంగళవారం రాత్రికి మరింత వర్షం కురిస్తే మరిన్ని గేట్లను ఎత్తుతామని, మూసీ పరీవాహన ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని, నార్సింగి నుంచి మంచిరేవులకు వెళ్లే రోడ్డును మూసేసినట్లు అధికారులు తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

వికారాబాద్ డీఈఓ రేణుకాదేవి

పరిగి: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. మంగళవారం పరిగి పట్టణంలో ఎంఈఓలు, జీహెచ్‌ఎంలు, ఎఫ్‌ఎల్‌ఎన్ మెంటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

నేరాల్లో పాలుపంచుకున్న వారికి బైండోవర్


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

కేశంపేట: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ నేరాల్లో పాలుపంచుకున్న వ్యక్తులను మంగళవారం తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముందు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామన్నారు. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన భానుచందర్, కేశంపేటకు చెందిన జంగయ్య, మహేశ్, ఎల్లస్వామి, నిర్దవెల్లికి చెందిన నర్సింహాచారిని బైండోవర్ చేశారు.

ఇద్దరు యువకులకు రిమాండ్

రూ.1.01లక్షల విలువైన 4.04 కిలోల గంజాయి స్వాధీనం


పహాడీషరీఫ్: గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన ప్రకారం.. రోషన్ దౌలాలో నివాసం ఉండే బిసా కొమ్రీ అలియాస్ చింటూ(19), కొక్కిలిగడ్డ హారూణ్ అలియాస్ అరుణ్(20), ఒడిశాకు చెందిన అర్జున్ బైక్‌పై శివాజీచౌక్ మీదుగా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో తనిఖీల్లో ఉన్న ఎస్ఐ కోటేశ్వర్ రావు వారిని సోదాలు చేయగా మూడు ప్యాకెట్లలో రూ.1.01 లక్షల విలువైన 4.04 కిలోల గంజాయి లభ్యమైంది. అర్జున్ పరారీలో ఉండగా.. మిగిలిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దసారా

తండాల్లో మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా

- పండుగ సమయంలో భారీగా విక్రయాలు!
- రహస్య స్థావరాల్లో సారా కాస్తున్న గిరిజనం
- ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న ముడిసరుకు


మంచాల అటవీ ప్రాంతంలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)


కొర్ర తండాలో డ్రమ్ముల్లో పట్టుబడిన బెల్లం పానకం నిల్వలు (ఫైల్)

యాచారం: కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. కొన్నాళ్లుగా వాసన లేని నాటుసారా తండాల్లో విచ్చలవిడిగా తయారీ అవుతుండడంతో ఎక్సైజ్ శాఖలో కలవరం మొదలైంది. గతంలో యాచారం, మంచాల, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, కందుకూరు మండలాల పరిధిలోని గిరిజన తండాల్లో వేలాది లీటర్ల నాటు సారా విచ్చలవిడిగా లభ్యమయ్యేది. తయారీ, అమ్మకంతో వందలాది మంది గిరిజనులతో పాటు ఆయా గ్రామాల్లోని వ్యాపారులు జీవనోపాధి పొందేవారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం, పాలక ప్రభుత్వాల ఆర్థిక ప్రోత్సాహంతో సారా తయారీ నిర్మూలన దశకు వెళ్లింది. ఎక్సైజ్ శాఖ పోలీసులు మెరుపు దాడులతో కేసుల నమోదుతో ఆయా మండలాల్లోని గిరిజనులు జైలుపాలు అయ్యారు. చదువులు, ఉద్యోగాల సాధనపై గిరిజన యువతలో మార్పులు రావడంతో సారా కట్టడి చేశారు. ప్రజల్లోనూ ఆర్థిక వనరులు మెరుగవడంతో తాగడానికి నిరాసక్తత చూపారు.

వేలాది కిలోల ముడిసరుకు విక్రయం

తండాల్లో కొన్ని నెలలుగా నాటు సారా తయారీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. యాచారం మండలం నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, కొత్తపల్లి, అయ్యవారిగూడెం గ్రామాల్లోని తండాలు, మంచాల మండలంలోని బోడకొండ, ఎల్లమ్మతండా, సత్తితండా, లోయపల్లి గ్రామాల తండాల్లో, కడ్తాల్ మండలం పల్లెచల్కతండా, మాడ్గుల మండలం గుడితండా, వెంకటేశ్వరతండా, ఆమనగల్లు మండలాల్లోని పలు తండాల్లో సారా బట్టీలు పెరిగాయి. మద్యం ధరలు అమాంతం పెరగడం, రూ.150 ఖర్చు చేస్తే లీటరుకు పైగా దొరుకుతుండడంతో నిరుపేదలు మళ్లీ సారా తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్సైజ్ పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్లం, పటిక ఇతర ముడిసరుకులను మాల్, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, ఆరుట్ల, మంచాల, యాచారం కేంద్రాల్లోని వ్యాపార దుకాణాల్లో వేలాది కిలోల చొప్పున విక్రయాలు చేసినట్లు తెలుస్తోంది.

రహస్య స్థావరాల్లో డంప్‌లు

బోనాలు, దసరా పండుగలకు గ్రామాల్లో జోరుగా సారా అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఆయా తండాల్లోని గిరిజనులు వ్యవసాయబావులు, అటవీప్రాంతాల్లోని రహస్య ప్రాంతాల్లో డంప్‌లు ఏర్పాటు చేసుకుని తయారీ చేసి విక్రయించినట్లు తెలుస్తోంది. దసరాకు ముందే ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు యాచారం, మంచాల మండలంలోని పలు తండాల్లో దాడులు చేపట్టి వేలాది లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. కల్లు దుకాణాలు, మాల్, యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్ మండల కేంద్రాల్లోనూ నాటు సారా అమ్మకాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధి లేకే..



తండాల్లో నాటుసారా తయారు కాకుండా సర్కారే దృష్టి సారించాలి. అక్కడక్కడ మళ్లీ సారా తయారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. వారిని గుర్తించి జీవనోపాధికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చాలి. గొర్రెలు, మేకలు, చిరు వ్యాపారాల కోసం బ్యాంకు రుణాలు ఇప్పించాలి. ఉపాధి లేక కొందరు మళ్లీ సారా తయారీపై దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

– కొర్ర అరవింద్‌నాయక్, మంతన్‌గౌరెల్లి

కఠిన చర్యలు



పలు తండాల్లో మళ్లీ సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం ఉంది. దసరా పండుగకు ముందు దాడులు చేపట్టి వేలాది లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశాం. గట్టి నిఘా ఏర్పాటు చేశాం. తయారీదారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు.

– సీతారాంరెడ్డి, ఎక్సైజ్ శాఖ సీఐ, ఇబ్రహీంపట్నం డివిజన్

డాక్టరేట్ సాధించిన గిరిపుత్రుడు



పట్టా అందుకుంటున్న విఠల్ రాథోడ్

తాండూరు టౌన్: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని నిరూపించాడు ఓ గిరిపుత్రుడు. పేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ సాధించాడు బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన విఠల్ రాథోడ్. తల్లి నాగిబాయి, తండ్రి రాము నాయక్ ద్వితీయ పుత్రుడైన విఠల్ రాథోడ్ చిన్ననాటి నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనపరిచే వాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయినా, పట్టుదలతో చదివి ఏకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డి పట్టా సాధించాడు. పేదరికం ఉన్నత చదువులకు అడ్డంకి కాదని నిరూపించాడు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఈడీ పూర్తి చేసిన ఆయన, 2020లో హెసీయూ నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ చాటి అడ్మిషన్ సాధించాడు. హెచ్‌సీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతా గోపీనాథ్ పర్యవేక్షణలో ‘స్వదేశీ విద్యార్థుల జీవన నైపుణ్యాలు, నియంత్రణ స్థితికి సంబంధించి ద్వితీయ స్థాయిలో మానసిక సామాజిక సామర్థ్యం’ అనే అంశంపై ఐదేళ్ల పాటు పరిశోధన చేసి 2024లో థీసిస్ సమర్పించారు. అతని పరిశోధనకు గాను మంగళవారం హైదరాబాద్‌లో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విఠల్ రాథోడ్ దేశంలోనే అత్యంత కఠిన పరీక్షల్లో ఒకటైన యూజీసీ నెట్‌లో అర్హత సాధించి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికై నెలకు రూ. 53వేల పారితోషకాన్ని ఐదేళ్ల పాటు తీసుకున్నారు. అలాగే జనవరి 2023లో దక్షిణాఫ్రికా రాజధాని కేప్ టౌన్‌లో బ్లెండెడ్ లర్నింగ్, ప్రతిభావంతమైన అభ్యసానికి ఒక హైబ్రిడ్ బోధనా నమూనా అనే అంశంపై ప్రెజెంటేషన్ ఇచ్చి పత్ర సమర్పణ చేయడం విశేషం. డాక్టరేట్ సాధించిన విఠల్ రాథోడ్‌ను గ్రామస్తులు, సహచరులు, కుటుంబ సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

ఓయో రూంలో యువకుడి ఆత్మహత్య

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జై జవాన్ కాలనీకి చెందిన మన్నె నరేందర్ (30) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఏఎస్‌రావునగర్‌లోని సిఎంఆర్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేసిన నరేందర్ ఈ మధ్యే పనికి వెళ్లడం మానేశాడు. ప్రాథమిక సమాచారం మేరకు స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయినట్లు తెలిసింది. ఈ క్రమంలో పెరిగిన ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఈసీఐఎల్‌లోని ఓయో రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

మూసాపేట: భార్యను హత్య చేసిన కేసులో న్యాయస్థానం మంగళవారం భర్తకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి... కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా మదర్గాన్ గ్రామానికి చెందిన కుల్పే సంతోష్ (46) భార్య సురేఖతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట, కైత్లాపూర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేసేవాడు. సంతోష్ నిత్యం మద్యం సేవించి భార్యను మానసికంగా, శారీకంగా వేధించేవాడు. 2022 మే 16వ తేదిన సంతోష్ భార్యను గొంతు కోసి ఆమె మెడ నుంచి బంగారం పుస్తె, గుండ్లు తీసుకుని వెళ్లాడు. ఆమె చికిత్స పొందుతూ 19వ తేదిన గాంధీ ఆసుపత్రిలో చనిపోయింది. 16వ తేదీన కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు సంతోష్‌ను అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. భార్య గొంతు కోసి చంపినందుకు దోషిగా నిర్ధారిస్తూ కూకట్‌పల్లిలోని మేడ్చల్ జిల్లా సెషన్స్ జడ్జి, ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీకి చెందిన జూబ్లీహిల్స్ నాయకుడు నవీన్ యాదవ్‌పై మధురానగర్ పీఎస్‌లో కేసునమోదైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో నవీన్ యాదవ్ ఫేక్ ఎపిక్ (ఓటరు) కార్డులను పంపిణీ చేశారని ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. దాని ఆధారంగా జూబ్లీహిల్స్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రజినీకాంత్‌రెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాలను ఉల్లంఘిస్తూ పౌరులకు చట్ట విరుద్ధంగా ఎపిక్ కార్డుల పంపిణీ జరిగిందని, ఇదే నిజమైతే అవి నేరం కిందకు వస్తాయని, ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తు జరిపి, ఇందుకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఆర్ఓ ఫిర్యాదుపై స్పందించిన ఇన్‌స్పెక్టర్.. కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్‌పై బీఎన్ఎస్ 170, 171, 174 తో పాటుగా ప్రజాప్రాతినిధ్యం చట్టం కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్యాలయంపై దాడి కేసులో ..

కోర్టుకు 23 మంది బీజేపీ నాయకులు


కోర్టు వద్ద బీజేపీ నాయకులు

మణికొండ: మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో అప్పటి కమిషనర్ పెట్టిన కేసులో భాగంగా విచారణ ప్రారంభం కావటంతో మంగళవారం బీజేపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్ షిప్ రోడ్డు నెంబర్–13 వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. దాంతో మున్సిపల్ అధికారులు దాన్ని వెంటనే తొలగించారు. ఆగ్రహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో అప్పటి మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్‌కుమార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా 23 మందిపై కేసు నమోదు చేశారు. మంగళవారం నాంపల్లిలోని సీబీఐ కోర్టు హాల్లో విచారణకు రావటంతో పార్టీ నాయకులు హాజరయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవర్లతో సమావేశమైన ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

మణికొండ: జీవనోపాధికి ఆటోలను నడుపుతున్న వారిలో కొందరు ఇష్టానుసారంగా నడపటం, ఎక్కడ పడితే అక్కడ ఆపటం, ప్రయాణికుల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోవటంతో అందరికీ చెడ్డపేరు వస్తుందని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నార్సింగిలోని కేవీఎంఆర్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పని సరిగా పాటించాలన్నారు. రోడ్లపై వేగంగా నడపరాదని ఆటో డ్రైవర్లు తమ వద్ద ఆర్సీ, ఇన్సూరెన్స్ లైసెన్సు ఎల్లప్పుడు ఉంచుకుని డ్రస్సులను ధరించే ఆటోలు నడపాలన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించినా నియమాలను పాటించకపోయినా చర్యలు తప్పవన్నారు. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, అదనపు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఎస్సై రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

‘వర్టెక్స్’ కేసులో ఏసీబీ దర్యాప్తు కోరాం

- హైకోర్టులో నడుస్తున్న కేసులో ఇంప్లీడ్ అవుతాం
- సోషల్ మీడియాలో జరుగుతున్నది దుష్ప్రచారం
- ఓ ప్రకటన విడుదల చేసిన హైడ్రా అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ విలేజ్‌లోని వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించిన వివాదంపై హైడ్రా స్పందించింది. దీనిపై తాము ఇప్పటికే పహాడీషరీఫ్ ఠాణాలో కేసు నమోదు చేయించామని, దర్యాప్తు చేయాల్సిందిగా అవినీతి నిరోధక శాఖను (ఏసీబీ) కూడా కోరామని స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించి సోషల్‌మీడియాలో తమపై జరుగుతున్నది దుష్ప్రచారమని పేర్కొంది. వర్టెక్స్ సంస్థకు–చైతన్య రెడ్డికి మధ్య ఉన్న వివాదంలో తలదూర్చిన కొందరు హైడ్రా పేరు చెప్పి చైతన్య రెడ్డి నుంచి రూ.50 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసు విచారణను పహాడీషరీఫ్ పోలీసులు ముమ్మరం చేశారని పేర్కొంది. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న సుంకరి నరేష్‌తో పాటు ప్రవీణ్, చందు శ్రీనివాస్ పహాడీషరీఫ్ పోలీసుల విచారణకు సహకరించకుండా రకరకాల ఎత్తుగడలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. గతంలో వారు వాడిన ఫోన్లను పోలీసులకు అప్పగిస్తే వాస్తవాలు బయటపడతాయని, ఫోన్లు పోయాయని ఒకరు, పహాడీషరీఫ్ పోలీసులు విచారణకు రమ్మంటే రాకుండా మరొకరు కాలయాపన చేస్తున్నారని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో అవసరమైతే విచారణను చేపట్టాలని ఏసీబీ కూడా కోరామని పేర్కొంది. ఇందుకు ఏసీబీ కూడా సమ్మతి వ్యక్తం చేసిందని హైడ్రా పేర్కొంది. చదువుకు సంబంధించి ఫేక్ సర్టిఫికేట్లతో లాయర్‌గా చెలామణి అవుతున్న సుంకరి నరేష్‌ను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేసిందని, దీనిపై ఆయన స్టే తెచ్చుకున్నప్పటికీ సుంకరి నరేష్ సర్టిఫికేట్లు నకిలీవని నిర్ధారణ అయినట్లు హైడ్రా పేర్కొంది. రూ.50 లక్షలు సుంకరి నరేష్‌కు ఇచ్చినట్లు చైతన్య రెడ్డి స్పష్టంగా చెప్పిన సాక్ష్యం తమ వద్ద ఉందని పేర్కొంది. వివిధ కేసులు విచారణలో భాగంగా తనకు చైతన్య రెడ్డి రెండు చెక్కులు ఇచ్చారని, అందులో ఒకటి రూ.10 లక్షలది కాగా రెండోది రూ.20 లక్షలది అంటూ సుంకరి నరేష్ చెబుతున్నారని, పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్‌లో సెప్టెంబరు 4న కేసు నమోదు కాగా..ఆ చెక్కుల వ్యవహారం అదే నెల 8న బయట పెట్టారని వెల్లడించింది. తాను జూన్‌లోనే రూ.50 లక్షలు ఇచ్చినట్టు చైతన్య రెడ్డి తెలిపారని పేర్కొంది. ఆ చెక్కులపై రాసిన రాత ఎవరిదనేది తేల్చే పనిలో పోలీసులు నిమఘ్నమయ్యారని హైడ్రా పేర్కొంది. మొత్తమ్మీద ఈ వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దిగితే అసలు వాస్తవాలు బయటపడతాయని హైడ్రా భావిస్తోంది. ఏసీబీతో దర్యాప్తు చేయించే విషయమై హైకోర్టు కేసులో తాము కూడా ఇంప్లీడ్ అవుతామని హైడ్రా స్పష్టం చేసింది.

యువతి అదృశ్యం


పుష్ప (ఫైల్)

మాడ్గుల: ఓ యువతి అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కలకొండ గ్రామానికి చెందిన తాంత్ర పుష్ప డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమె మూగ, చెవుడుతో ఇబ్బంది పడుతుంది. నాలుగు నెలల క్రితం ఇంటికి వచ్చిన ఆమె సెప్టెంబర్ 9వ తేదీన హనుమకొండలోని కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. ఇటీవల తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లగా ఇక్కడకు రాలేదని చెప్పడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. ఎంతకూ ఆచూకీ లభించక మంగళవారం యువతి తల్లి చెన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కొత్తూరు: ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నర్సయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రవిరాజ్(31) ఆరేళ్ల క్రితం మొయినాబాద్ మండలం బాకారం గ్రామానికి చెందిన లాస్యను వివాహం చేసుకున్నాడు. ఐదునెలల క్రితం దంపతుల మధ్య గొడవ జరగడంతో లాస్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన రవిరాజ్ తల్లి కమలమ్మకు అనారోగ్యం బాగలేకపోవడంతో కూతురు భూలక్ష్మి షాద్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అనంతరం ఈ నెల 6న సాయంత్రం ఇద్దరూ తిమ్మాపూర్‌లోని తమ ఇంటికి వచ్చి తలుపులు తెరవాలని కోరగా రవిరాజ్ నుంచి సమాధానం రాలేదు. దీంతో స్థానికుల సహకారంతో తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లగా రవిరాజ్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మరుగుదొడ్ల శుభ్రతకు కృషి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


స్వచ్ఛ ట్రక్కులను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండలాలకు విస్తరించడం లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు కొత్త స్వచ్ఛ ట్రక్కులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని 11 మండలాల్లో 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయని తెలిపారు. అదనంగా ఐదు ట్రక్కులు చేరాయని తెలిపారు. వీటి ద్వారా 330 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు.